
సాక్షి
కాకినాడ
సోమవారం | 27 | జనవరి | 2025



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జి.సోము వేంకట కార్తిక్ (భీమవరం) ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. దాతకు ఈఓ సుబ్బారావు అన్నదానం బాండ్ అందజేశారు.




బొప్పాయి.. బాగుందోయి

ఒకప్పుడు పెరటి తోటలకే పరిమితమైన బొప్పాయి ప్రస్తుతం పొలాల్లో తోటలుగా విస్తరిస్తోంది. ఒకసారి నాటితే రెండేళ్ల పాటు దిగుబడి ఇస్తోంది.

8 లో

డెల్టాలకు 9,945 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,945 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,075, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.65 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

లోవలో నేడు సరస్వతీ పూజ

తుని రూరల్: లోవ దేవస్థానంలో రెండు రోజుల పాటు సరస్వతీ దేవి పూజ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ధర్మకర్తల సమావేశంలో సోమ, మంగళవారాల్లో తలుపులమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో నిర్వహించే పూజలు, హోమం నిర్వహణపై చర్చించారు. అనంతరం చైర్మన్, ఈఓలు విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం సరస్వతీ దేవి పూజ ప్రారంభమవుతుందన్నారు. మంగళవారం ముత్తయిదువులచే 108 కలశాలతో అమ్మవారికి సంప్రోక్షణ జరుగుతుందన్నారు. వేద పండితులు, ప్రధాన అర్చకులచే సరస్వతీదేవి హోమం నిర్వహిస్తారని తెలిపారు. పూర్ణాహుతిలో ప్రభుత్వ విప్ యనమల దివ్య పాల్గొంటారన్నారు. పూజల్లో ఉంచిన పెన్నులను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వేద పండితులు ఆశీస్సులు అందజేస్తారన్నారు. రూ.4.10 కోట్లతో చేపట్టే లోవ దేవస్థానం పునర్నిర్మాణ పనులకు దేవదాయ శాఖ అనుమతులు లభించాయని చెప్పారు. రూ.3.65 కోట్లతో 4 ఎస్కలేటర్ల ఏర్పాటుకు, రూ.65 లక్షలతో రాజగోపురం ముందు రాతి మెట్ల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయని వివరించారు.

సెల్‌ఫోన్ మింగి మానసిక రోగి మృతి

కాకినాడ క్రైం: సెల్‌ఫోన్ మింగిన ఓ మహిళ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. రాజమహేంద్రవరం బొమ్మూరుకు చెందిన పెనుమళ్ల రమ్య స్మృతి (35) మానసిక అనారోగ్యంతో బాధ పడుతోంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని సైకియాట్రీ వార్డులో శనివారం చేరింది. అక్కడ తగిన పర్యవేక్షణ లేకపోవడంతో కీ ప్యాడ్ ఫోన్ మింగేసింది. వెంటనే వైద్యులు చికిత్స చేసి ఫోన్ తొలగించారు. ఈ క్రమంలో ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. ఈసోఫాగస్ (అన్నవాహిక) పూర్తిగా దెబ్బతింది. దీంతో అక్కడి వైద్యులు ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. రమ్య స్మృతిని శనివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. సెల్‌ఫోన్ తొలగింపు ప్రక్రియలో రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యులు చేసిన పొరపాటు వల్లే తమ కుమార్తె చనిపోయిందని తండ్రి విలపించాడు. ఆరోగ్య పరిస్థితి నిలకడయ్యే వరకూ అక్కడే ఉంచాలని కోరినా రాజమహేంద్రవరం జీజీహెచ్ అధికారులు బలవంతంగా కాకినాడకు తరలించారని ఆరోపించాడు. అక్కడి నుంచి కాకినాడ చేరేందుకు రెండు గంటల సమయం పట్టిందని, ఆ వ్యవధిలో రమ్య ఆరోగ్య స్థితి మరింత క్షీణించి మరణానికి దారి తీసిందని వాపోయాడు.

నమ్మించాడు.. నట్టేట ముంచాడు



మాచవరంలో కర్రి వెంకటరెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తున్న బాధితులు

రాయవరం: రియల్ ఎస్టేట్ వ్యాపారినంటూ ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద డబ్బులు తీసుకున్నాడు. మూడు నెలలుగా డబ్బులు అడుగుతుంటే, సరైన సమాధానం లేదు. దీంతో బాధితులు పదే పదే అడగడం ప్రారంభించారు. చివరకు ఇల్లు విడిచి పరారవ్వడంతో బాధితులంతా రోడ్డున పడ్డారు. కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం గ్రామం పల్లపువీధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కర్రి వెంకటరెడ్డి (దొరబాబు) గ్రామంలోని పల్లపు వీధిలో నివాసం ఉంటున్నాడు. స్థిరాస్తి కలిగి ఉండడం.. మోతుబరి కుటుంబాలతో ఇద్దరు కుమార్తెలకు వియ్యం అందడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని చెప్పడంతో పలువురు అతని వద్ద డబ్బులు మదుపు చేశారు. కుమార్తెల వివాహం నిమిత్తం దాచుకున్న డబ్బులు కొందరు, దేవాలయం కట్టే నిమిత్తం దాచిన సొమ్ము ఇంకొందరు, ఒక మహిళ దాచుకున్న డబ్బులతో పాటు, బంగారాన్ని మదుపు పెట్టడం.. ఇలా పలువురు దొరబాబు వద్ద రూ.లక్షలు ఉంచారు. మాచవరం, సోమేశ్వరంతో పాటు, అనపర్తి మండలం పులుగుర్త, రామకోట తదితర గ్రామాలకు చెందిన సుమారు 45 మంది దొరబాబు వద్ద సుమారు రూ.4.5 కోట్ల వరకూ మదుపు చేశారు. మూడు నెలలుగా దాచుకున్న డబ్బులను తమ అవసరార్థం తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ అదిగో ఇదిగో అంటూ దొరబాబు కాలయాపన చేశాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు విషయాన్ని స్థానిక గ్రామ పెద్దల వద్దకు తీసుకువెళ్లినట్లుగా సమాచారం. బాధితుల నుంచి ఒత్తిడి పెరగడం.. దొరబాబు ఇంటి వద్ద లేకపోవడంతో బాధితులంతా దొరబాబు ఇంటి ముందు ఆదివారం ఉదయం ధర్నాకు దిగారు. తాము దాచుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలంటూ బాధితులు కోరారు. అయితే దొరబాబు పరారవ్వడంతో బాధితులు ఫ్లెక్సీలు వేసి, అతని ఇంటి ముందే ధర్నా చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎస్సై డి.సురేష్‌బాబును వివరణ కోరగా, ఈ విషయమై తనకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదన్నారు.



మహిళా పోలీసు సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



ఆకట్టుకున్న విద్యా శాఖ శకటం



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

మువ్వన్నెల మెరుపులు



అలరించిన బాలికల నృత్యం

తల్లీ భారతి వందనం: భరతమాతగా ఆకట్టుకున్న బాలిక అభినయం

- జిల్లావ్యాప్తంగా వైభవంగా గణతంత్ర వేడుకలు
- కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉప్పొంగిన దేశభక్తి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- జెండా ఎగురవేసి, ప్రగతిని వివరించిన కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ క్రైం: దేశ గణతంత్ర దినోత్సవ వేళ జిల్లావ్యాప్తంగా నింగి వీధుల్లో మువ్వన్నెల పతాక టీవీగా రెపరెపలాడింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఇతర ప్రాంతాల్లో అధికారులు, నేతలు, ప్రజలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్వతంత్ర భారతావని ఆవిర్భావ చరితను, స్వాతంత్ర్య సమరవీరుల, మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆధ్వర్యాన, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడలోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం గణతంత్ర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ జాతీయ జెండాను ఎగురవేసి, సాయుధ పోలీసు దళాలు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మహిళా పోలీస్ దళాలు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో మైదానం కిటకిటలాడింది. ఈ వేడుకల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను కట్టి పడేశాయి. దేశభక్తి ఉట్టి పడేలా తీర్చిదిద్దిన కళారూపాలు సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. మనవైన శాస్త్రీయ నృత్యరీతులతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన నృత్యాలను కూడా విద్యార్థులు ప్రదర్శించి, సభికులను మంత్రముగ్ధుల్ని చేశారు.

ఇదీ ప్రగతి

ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా ప్రగతిని వివరించారు. ఖరీఫ్‌లో రూ.6,330 కోట్ల పంట రుణాలు మంజూరు చేశామని చెప్పారు. వరదల వల్ల 14,424 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లగా 27,084 మంది రైతులకు రూ.36.25 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేశామన్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన ద్వారా ఈ ఏడాది ఉద్యాన పంటల విస్తరణ లక్ష్యం 165 హెక్టార్లు కాగా, 149 హెక్టార్లలో పూర్తి చేశామన్నారు. పశు సంవర్ధక శాఖ 675 పశువుల షెడ్లు మంజూరు చేయగా, 262 షెడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యకారులకు రూ.2.43 కోట్ల మేర ప్రయోజనాలు కల్పించామన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు రూ.249 సగటు వేతనం అందిస్తూ 61 లక్షల పని దినాలు కల్పించామని చెప్పారు. రోడ్ల అభివృద్ధికి నిర్దేశించిన 1,149 పనుల్లో ఇప్పటికే 521 పూర్తి చేశామన్నారు. 1,253 ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న 1,33,258 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. గృహ నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని, ఏపీ టిడ్కో ద్వారా 7,288 ఇళ్లు నిర్మించామని చెప్పారు. అలాగే, వివిధ శాఖల ప్రగతిని కూడా కలెక్టర్ వివరించారు. వివిధ సంస్థలు అందించిన రూ.3.90 కోట్ల సీఎస్ఆర్ నిధులను 71 సామాజిక, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడాది కాలంలో 23,238 అర్జీలు రాగా, ఇప్పటి వరకూ 9,079 పరిష్కారమయ్యాయన్నారు. మరో 13,722 పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

ఆకట్టుకున్న శకటాలు

గణతంత్ర వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ విభాగాలు తమ కార్యకలాపాలు, తమ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న లబ్ధిని వివరిస్తూ ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, డీఆర్‌డీఏ, అటవీ, విద్యా శాఖలు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పలు ప్రభుత్వ విభాగాలు తమ శకటాలను ప్రదర్శించాయి.

275 మందికి ప్రశంసా పత్రాలు

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన 275 మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాలు అందించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ షణ్మోహన్ ఆసక్తిగా తిలకించారు. ఆయా విభాగాల పని తీరు, పురోగతిపై ఆరా తీశారు. మత్స్య, స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య, ఆరోగ్య, ఉద్యానవన, గ్రామీణ నీటి పారుదల, పట్టణాభివృద్ధి శాఖల ఆధ్వర్యాన స్టాళ్లు ఏర్పాటు చేశారు. అలాగే, ఆహార ఉత్పత్తుల స్టాల్ కూడా ఏర్పాటు చేశారు. వివిధ మత్స్య జాతులను ప్రదర్శిస్తూ మత్స్య శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉత్తమ సేవలకు పురస్కారాలు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్



జిల్లా విద్యా శాఖాధికారి రమేష్



జిల్లా వ్యవసాయాధికారి విజయ కుమార్



జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకర్



కాకినాడ పోర్టు అధికారి ధర్మశాస్త

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన 275 మంది వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వారికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు.



జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీవీ ప్రసాద్



ఆర్‌డీవో మల్లిబాబు



కలెక్టర్ సీసీ సాయి



జాయింట్ కలెక్టర్ సీసీ రఘు



జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్



జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్

రాజ్యాంగ స్ఫూర్తితో దేశం కోసం పునరంకితం

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాజ్యాంగ స్ఫూర్తితో దేశం కోసం ప్రతి ఒక్కరం పునరంకితమవుదామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ వైద్య నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో దేశ 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను కన్నబాబు ఎగురవేసి, వందనం చేశారు. అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇది భారతదేశం సర్వసత్తాక రాజ్యంగా అవతరించిన రోజని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, హక్కులు, బాధ్యతలు అన్నీ అమలులోకి వచ్చిన రోజని అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలు, అన్ని వర్గాల ప్రజల సమానత్వం కోసం ఐదేళ్ల పాటు ఏవిధంగా పని చేశారో మనందరం చూశామని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో కులాలు, మతాలు, ప్రాంతాలు, వ్యక్తులకు అతీతంగా ఆశ్రిత పక్షపాతం లేకుండా అందరం కలసిమెలసి ముందుకు నడుద్దామని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్, తిలక్ వంటి ఎందరో మహనీయుల త్యాగం, లక్షలాది మంది ఆత్మార్పణ, బలిదానంతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని భావి తరాలకు భద్రంగా అందించేందుకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా నడవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకటేశ్వరరావు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకల్లో విద్యార్థులు



టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓ టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు దర్శనమివ్వడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోటనందూరుకి చెందిన ఓ టీడీపీ నేత పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని ఓ ధాబా వద్ద ఆదివారం టెంట్లు వేసి, కేక్ కటింగ్ చేశారు. దీనికి స్థానిక హైస్కూల్లో జరిగిన గణతంత్ర వేడుకలకు వచ్చిన విద్యార్థులను తరలించారు. వారిలో కొందరితో ఆ నేతకు బొకేలు ఇప్పించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పించారు. దీనికి సంబంధించిన ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఇలా ఓ పార్టీ నేత పుట్టిన రోజు వంటి ప్రైవేటు కార్యక్రమాలకు తరలించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

లోవలో భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చిన 6 వేల మంది భక్తులు క్యూలో అమ్మవారిని దర్శించుకున్నారని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,09,100, పూజా టికెట్లకు రూ.79,470, కేశఖండన శాలకు రూ.8,040, వాహన పూజలకు రూ.2,900, పొంగలి షెడ్లు, కాటేజీలు, వసతి గదుల అద్దెలు రూ.35,620, విరాళాలు రూ.77,608 కలిపి మొత్తం రూ.3,12,748 ఆదాయం సమకూరిందని వివరించారు.



తలుపులమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా సత్యదేవుని రథ సేవ



ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అమ్మవారిని టేకు రథంపై ఊరేగిస్తున్న దృశ్యం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని రథ సేవను ఆదివారం ఆలయ ప్రాకారంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి టేకు రథంపై వేంచేయించారు. స్వామి, అమ్మవార్లకు అర్చకులు పవన్ తదితరులు పూజలు చేసిన అనంతరం రథసేవను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంపై ఊరేగించారు. రథ సేవ అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనం ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈఓ కొండలరావు, సూపరింటెండెంట్లు రామారావు, సుబ్రహ్మణ్యం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుడు, అమ్మవారిని సోమవారం ముత్యాల కవచాలతో (ముత్తంగి సేవ) అలంకరిస్తారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	16,000 – 16,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	280

క్లుప్తంగా

నేషనల్ అంపైర్లుగా అమలాపురం పీడీలు




అడపా శ్రీనివాస్ గొల్లకోటి శ్రీనివాసులు

అమలాపురం రూరల్: ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ జరిగే నేషనల్ గేమ్స్‌లో బాల్ బ్యాడ్మింటన్‌కు అంపైర్లుగా అమలాపురానికి చెందిన పీడీలు అడపా శ్రీనివాస్, గొల్లకోటి శ్రీనివాసులు ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. అమలాపురం ఈదరపల్లి వైకుంఠ పురానికి చెందిన అడపా శ్రీనివాస్ కామన గరువు స్కూల్లో పీడీగా పనిచేస్తున్నారు. పీడీ గొలకోటి శ్రీనివాస్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ అంపైర్‌గా పలు జాతీయ టోర్నమెంట్లకు వ్యవహరించారు. వీరిని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మ చౌదరి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ కొత్తపల్లి బాబు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్, ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్ఎం వి.చక్రధరరావు అభినందించారు.

వెచ్చబడమంట



గోకవరం దేవీచౌక్ వద్ద చలి మంట చుట్టూ చేరిన గోవులు

ప్రస్తుతం పగలు, రాత్రి అనే తేడా లేకుండా చలి వణికిస్తుంది. చలి తీవ్రతను తట్టుకునేందుకు ప్రజలు మంటలు వేసుకుంటున్నారు. పశువులు సైతం అక్కడ సేదతీరుతున్నాయి. గోకవరం దేవీచౌక్ వద్ద భోగి పండగను పురస్కరించుకుని వేసిన దుంగల వద్ద రోజూ ప్రజలు చలి మంటలు వేస్తున్నారు. ప్రజలు వెచ్చబడిన అనంతరం స్థానికంగా ఉన్న గోవులు మంట చుట్టూ చేరి వెచ్చదనం పొందుతున్నాయి. – గోకవరం

వ్యాపార కోణం



కుంభాభిషేకం రేవు వద్ద విక్రయానికి ఉంచిన కొమ్ము కోణం చేపలు

ఈ చిత్రంలో నేలపై వరసగా పెట్టిన చేపల పేరు కొమ్ము కోణం. ఐదు కిలోల నుంచి రెండు వందల కిలోల వరకూ బరువు ఉండే ఈ చేపలు మత్స్యకారులకు కాకినాడ తీరంలో భారీ ఎత్తున పడుతున్నాయి. కేరళలో డిమాండ్ ఉన్న ఈ చేపలను విక్రయించేందుకు కాకినాడ కుంభాభిషేకం రేవులో ఆదివారం ఇలా ఉంచారు. వీటి ధర కిలో రూ.100 నుంచి రూ.150 వరకూ పలుకుతోంది. – కాకినాడ రూరల్

కక్కా ముక్కా.. ఎంచక్కా



దివిలి జంక్షన్‌లో యథేచ్ఛగా మాంసం, చేపల విక్రయాలు

గణతంత్ర దినోత్సవం రోజున మాంసం, చేపలు విక్రయాలు జరపరాదని నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగింది. పెద్దాపురం మండలం దివిలి, చంద్రమాంపల్లి, తిరుపతి, పులిమేరు, కాండ్రకోట, కట్టమూరుతో పాటు చాలా చోట్ల నిబంధనలు ఉల్లంఘిస్తూ విక్రయాలు జరిపినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. – పెద్దాపురం

బొప్పాయి.. బాగుందోయి



గొల్లప్రోలు మండలంలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న బొప్పాయి తోట

- సేంద్రియ వ్యవసాయానికి పెరిగిన డిమాండ్
- పెరటి నుంచి పంట పొలాలకు చేరిన బొప్పాయి
- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలు
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం



విరగకాసిన బొప్పాయి కాయలు

పిఠాపురం: బొప్పాయి.. ఒకప్పుడు పెరటి తోటలకే పరిమితమైన చెట్టు ఇది. ప్రస్తుతం పంట పొలాల్లో తోటలుగా విస్తరిస్తోంది. ఒకసారి నాటితే రెండేళ్ల పాటు నిరంతరాయంగా దిగుబడి ఇస్తోంది. అందుకే ఈ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు వంద టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, సేంద్రియ పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవడంతో దిగుబడులు మరింత పెరిగాయని రైతులు అంటున్నారు. ఇతర పండ్లతో పోలిస్తే బొప్పాయిలో కెరోటిన్ అత్యధికంగా ఉంటుంది. విటమిన్లు పుష్కలంగా లభ్యం కావడం, ఆరోగ్యానికి మేలు చేసే వివిధ ఔషధ గుణాలు మెండుగా ఉండడంతో దీని వినియోగం నానాటికీ పెరుగుతోంది. కరోనా వచ్చిన నాటి నుంచి దీని వినియోగం మరింత అధికమైంది. బొప్పాయి ఉష్ణ మండలపు పంట. 35 డిగ్రీల నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య ఈ మొక్కలు బాగా పెరుగుతాయి.

జిల్లాలో బొప్పాయి సాగు భూములు	: 70.48 హెక్టార్లు
మొత్తం రైతులు	: 290 మంది
ఏటా దిగుబడి	: 7,500 టన్నులు
ప్రస్తుతం టన్ను ధర	: రూ.12 వేలు
సేంద్రియ పద్ధతిలో బొప్పాయి పంట	: 34 హెక్టార్లు
సాగు చేస్తున్న రైతులు	: 110 మంది
ఏటా దిగుబడి	: 2 వేల టన్నులు
ప్రస్తుతం టన్ను ధర	: రూ.22 వేలు

నీరు నిల్వ ఉండని ఎర్ర నేలలు, తేలిక పాటి నల్ల రేగడి నేలలు దీని సాగుకు బాగా అనుకూలం. మురుగు నీటి సౌకర్యం ఉండి నీటి వసతి కలిగి ఉంటే బొప్పాయిని ఏడాది పొడవునా ఏ సమయంలోనైనా నాటుకోవచ్చు. కాకినాడ జిల్లాలో మెట్ట ప్రాంతాలైన పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల్లో ఈ సాగు ఏటా పెరుగుతోంది. తెగుళ్లు, వైరస్‌లు పంటను కొంత ఇబ్బంది పెడుతున్నా ఉద్యాన శాఖ, ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు వాటిని అధిగమించి మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లా నుంచి ఏటా సుమారు 7,500 టన్నుల బొప్పాయి ఢిల్లీ, ముంబయి వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

పెరిగిన డిమాండ్

రసాయన ఎరువులు మందులు వాడిన పంట కంటే సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన బొప్పాయికి మంచి డిమాండ్ ఉంటోంది. కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు మండలం దుర్గాడ, తాటిపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సేంద్రియ విధానంలో బొప్పాయి సాగు చేపడుతున్నారు. రసాయన, ఎరువులు పురుగు మందులు వాడిన పంటలు తెగుళ్లు సోకి కాయ నాణ్యత దెబ్బ తినడంతో నష్టాలు చూశామని, ఇప్పుడు సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలో నష్టాలు లేకుండా లాభాలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో వినియోగానికి ఇతర ప్రాంతాల నుంచి బొప్పాయి దిగుమతి చేసుకునే వారు ఇప్పుడు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునే స్థాయిలో ఉన్నారు.

అంతా లాభమే..



ఇప్పటి వరకూ రసాయన ఎరువులు, పురుగు మందులతో బొప్పాయి సాగు చేసేవాడిని. పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వచ్చేది. దీంతో ఎంత పండినా లాభాలు అంతంత మాత్రంగానే ఉండేవి. కానీ ఇప్పుడు సేంద్రియ విధానంలో బొప్పాయి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం పెట్టుబడి సగానికి సగం తగ్గింది. తెగుళ్ల అంతగా లేకపోవడంతో దిగుబడి బాగుంది. లాభాలు వస్తున్నాయి.

– జీలకర్ర శ్రీను, రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

అవగాహన కల్పిస్తున్నాం



ఉద్యాన శాఖ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. ఎక్కువగా వైరస్‌లు, కాండం తొలుచు పురుగు వల్ల నష్టాలు కలుగుతాయి. వాటి నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలి. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్టాలను అధిగమించవచ్చు. జిల్లాలో బొప్పాయి తోటల పెంపకం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

– ఎస్.మల్లికార్జునరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, కాకినాడ

అందుబాటులో సేంద్రియ ఎరువులు



గొల్లప్రోలు మండలంలో గతంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి పంటలు కోల్పోయిన రైతులు ఎందరో ఉన్నారు. వారంతా ఇప్పుడు సేంద్రియ సాగు చేసి మంచి లాభాలు పొందుతున్నారు. ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో బొప్పాయి సాగు ప్రారంభించారు. వారందరికీ గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల, శిక్షణ కేంద్రం ద్వారా అన్ని రకాల సేంద్రియ ఎరువులు, ద్రావణాలు అందుబాటులోకి తీసుకువచ్చాం.

– గుండ్ర శివ చక్రం, గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణ కేంద్రం నిర్వాహకుడు

అట్టహాసంగా గణతంత్ర వేడుకలు



జెడ్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

బోట్‌క్లబ్ (కాకినాడ): స్థానిక జెడ్పీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేశారు. ఉద్యోగుల సేవలను విప్పర్తి కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మణరావు, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రమేష్, మూర్తి పాల్గొన్నారు.

వేలివెన్ను 'శశి'లో గణతంత్ర వేడుకలు



వేలివెన్ను శశి ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ షేక్ షానూర్

ఉండ్రాజవరం: వేలివెన్ను శశి విద్యా సంస్థల ప్రాంగణంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశి పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ షానూర్ జాతీయ పతాకాన్ని, ఇన్‌చార్జి ఎం.సత్యనారాయణ పాఠశాల పతాకాన్ని ఎగురవేశారు. ప్రిన్సిపాల్ షానూర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన త్యాగమూర్తులను కొనియాడారు. వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యలో రాణించిన విద్యార్థులకు, వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మిసుప్రియలు విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాలీ బ్రేకులు ఫెయిల్

- డివైడర్‌ను ఢీకొని బోల్తా
- హైవేపై తప్పిన పెను ప్రమాదం



రోడ్డుకు అడ్డంగా బోల్తా పడి ట్రాలీ



ట్రాలీని క్రేన్‌తో తొలగిస్తూ..

రాజానగరం: ట్రాలీకి బ్రేక్‌లు ఫెయిల్ అయిన ఘటన జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అయితే సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇనుప ఊచల లోడుతో కాకినాడ నుంచి విజయవాడ గన్నవరం వెళ్తున్న భారీ ట్రాలీ రాజానగరం మండలం దివాన్‌చెరువు పెట్రోల్ బంకు వద్ద రహదారిపై బోల్తా పడింది. గైట్ కళాశాల దాటిన తరువాత దివాన్‌చెరువు వరకూ రహదారి పల్లంగా ఉండటంతో వాహనాలు కాస్త వేగంగా వెళ్తుంటాయి. ఈ క్రమంలో వెళ్తున్న ట్రాలీకి ముందు బైకుపై వెళ్తున్న ఒక ఆకతాయి రహదారిపై అడ్డదిడ్డంగా రావడంతో ట్రాలీ అతనిని ఢీకొనే సమయంలో డ్రైవర్ మహ్మద్ ఆదిల్ షడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాలీ వ్యాక్యూమ్ డౌన్ అయి, బ్రేకులు ఫెయిలయ్యాయి. ట్రాలీ వేగాన్ని నియంత్రించేందుకు అతను చేసిన ప్రయత్నం ఫలించ లేదు. అదే వేగంతో వాహనం ముందుకు వెళ్తే జన సంచారం అధికంగా ఉండే దివాన్‌చెరువు కూడలిలో పెను ప్రమాదానికి దారితీస్తుందని భావించిన డ్రైవర్ ముందుచూపుతో పెట్రోలు బంకు వద్ద డివైడర్‌ని ఢీకొట్టాడు. దీంతో ట్రాలీ డివైడర్‌పైకి ఎక్కడంతోపాటు రహదారికి అడ్డంగా బోల్తాపడి, దానిపై ఉన్న ఇనుప ఊచలు చెల్లాచెదురుగా పడ్డాయి. క్యాబిన్ ముందు భాగం తునాతునకలైంది. డ్రైవర్ ట్రాలీలో ఇరుక్కుపోవడంతో వెనుక నుంచి వచ్చిన ఇతర వాహనాల్లోని వారు చొరవ తీసుకుని అతనిని స్వల్ప గాయాలతో బయటకు తీశారు. ఈ ప్రమాదంతో రహదారిపై రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు ముందుకు వెళ్లే మార్గం లేక, రెండు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలం నుంచి వాహనాలు రాజానగరం వైపునకు బారులు తీరాయి. ఎట్టకేలకు రెండు ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ అంతరాయాన్ని నివారించడంలో బొమ్మూరు పోలీసులు చురుకైన పాత్ర పోషించారు. రహదారికి అడ్డంగా బోల్తా పడిన ట్రాలీని క్రేన్ల సాయంతో తొలగించి, జీఎస్ఎల్, గైట్ కళాశాలల వద్ద ఉన్న సర్వీసు రోడ్ల మీదుగా ట్రాఫిక్‌ని మళ్లించడంతో సాయంత్రం 5 గంటలకు వాహనాలు ఒక్కొక్కటిగా ముందుకు కదిలాయి.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి చీకట్ల అఖిల్ (13) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 22న రామచంద్రపురం జగనన్న కాలనీలోని బంధువుల ఇంటికి స్కూటీపై వెళ్తుండగా మోటారు సైకిళ్లు ఢీకొట్టుకోవడంతో తలకు తీవ్ర గాయమైంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడకు తీసుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున అఖిల్ మృతి చెందాడు. అతని తండ్రి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు

మరో ఘటనలో..

ముమ్మిడివరం: స్థానిక బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుల్లో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. అయినవిల్లి మండలం ఎరకలంకకు చెందిన వడ్డీ సిరాజ్ (18), అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజులు మోటార్ సైకిల్‌పై ముమ్మిడివరం వస్తుండగా, కాకినాడ నుంచి మలికిపురం వెళ్తున్న నల్లి వంశీ, జి.మణికంఠలు మోటార్ సైకిల్‌పై వెళుతూ ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అమలాపురం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వడ్డీ సిరాజ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.

'సంక్రాంతికి వస్తున్నాం' ఓ పండగే..

- సినిమా గ్రాండ్ సక్సెస్
- సినీ హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి



శ్యామలా థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, మీనాక్షి చౌదరి, శిరీష్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా మాకు పండగ ఆనందాన్ని తెచ్చిందని, ఇది గ్రాండ్ సక్సెస్‌ను అందుకుందని చిత్ర హీరో విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. సినిమా విజయ యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం శ్యామల థియేటర్‌కి హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మాత శిరీష్ తదితరులు ఆదివారం ఉదయం ఆట సమయంలో విచ్చేశారు. మైత్రీ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు ఉదయరాజు, సత్తిరెడ్డి బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాల మధ్య యూనిట్ సభ్యులకు థియేటర్ దగ్గర ఘన స్వాగతం పలికారు. థియటర్‌లో వెళ్లిన వెంకటేష్, అనిల్ రావిపూడి తదితరులు ప్రేక్షకులకు అభివాదం చేస్తూ పలకరించారు. మీడియాతో హీరో వెంకటేష్ మాట్లాడుతూ ప్రేక్షకులంతా థియేటర్లకు వచ్చి సినిమా చూసి బాగా ఆనందిస్తున్నారని అన్నారు. గోదావరి యాసతో మాట్లాడడం సినిమాకు బాగా కలసి వచ్చిందని ఆయన చెప్పారు. గోదావరి జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమని, ప్రేక్షకులు ఆదరించడం, ఇక్కడ షూటింగ్‌లు జరగడం సహజమేనని ఆయన వ్యాఖ్యానించారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ తమ కాంబినేషన్లో ఎఫ్– 2 నుంచి చూస్తే ఇది మూడో సినిమా అని, కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు ప్రేక్షకులు పెద్ద హిట్ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. సినిమాలో బుల్లి రాజు పాత్ర డైలాగ్స్‌కు ఎలాంటి కాంట్రవర్సీ లేదని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎందుకంటే, ప్రేక్షకులు ఒకటికి ఐదుసార్లు సినిమా చూసేందుకు థియేటర్లకు వస్తున్నారని అన్నారు. బుల్లి రాజు డైలాగ్స్‌ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారన్నారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ ఈ సినిమాను అన్నిచోట్లా బాగా ఆదరిస్తున్నారని, జిల్లాలో ఇప్పటికే రూ.10 కోట్ల వసూలు దాటాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమా తనకు పెద్ద హిట్ ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వెంకటేష్, రానా అభిమానులు కోరుమిల్లి రాజశేఖర్, హనుమంతరావు నేతృత్వంలో అభిమానులతో కలసి వెంకటేష్ కేక్ కట్ చేశారు. థియేటర్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ నేతృత్వంలో టూ టౌన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మంగాదేవి, ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు బందోబస్తు నిర్వహించారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



పంచారామ క్షేత్రంలో ఉత్సవాలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలందించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం సామర్లకోట పంచారామ క్షేత్ర ఆవరణలో నిర్వహించిన సమావేశానికి ఈఓ భళ్ల నీలకంఠం అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా పారిశుధ్య పనులు, విద్యుత్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉత్సవాలను పర్యవేక్షించడానికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కంటే బాబును నియమిస్తున్నట్లు ప్రకటించారు. మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం మాట్లాడుతూ ఆర్భాటాలకు పోకుండా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. కొడా చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ గోదావరి కాలువ వంతెన వద్ద కొడా నిధులతో ముఖద్వారం నిర్మిస్తామని చెప్పారు. భక్త సంఘ నాయకుడు బిక్కిన పరమేశ్వరసాయి మాట్లాడుతూ ఆలయ ఆవరణలో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు విత్తనాల వెంకటరమణ మాట్లాడుతూ దేవాలయం వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు లేకుండా చూడాలన్నారు. జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ ఉత్సవాల్లో స్వామి వారి దర్శనానికి ఉచిత దర్శనం ఉందనే విషయాన్ని ఎక్కువగా ప్రచారం చేయాలన్నారు. దాతలు కర్రి వెంకట్రాజు, వాసవీ యూత్ నాయకులు మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు. స్వామివారి రథోత్సవానికి రూ.10 లక్షలు కేటాయించాలని రథోత్సవ కమిటీ డిమాండ్ చేసింది. గత ఏడాది రూ.5.50 లక్షలు ఇవ్వడంతో ప్రస్తుతం రూ.7.50 లక్షలు ఇచ్చే విధంగా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, సీఐ ఎ.కృష్ణభగవాన్ పాల్గొన్నారు.